క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



వీరారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండలంలోని మనవాలికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కాటంరెడ్డి వీరారెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాంత్రి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కిలివేటి సంజీవయ్య గురువారం గ్రామానికి చేరుకున్నారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, నాయకులు కలికి మాధవరెడ్డి, కె.వేణురెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలోని సాయినగర్‌లో వున్న సాయిబాబా ఆలయంలో గురువారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో హజరత్తయ్య

సైదాపురం: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. సైదాపురంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సర్వే నంబర్ 563 లో ఉన్న 6.75 ఎకరాల ప్రభుత్వ భూమిలో గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ భూమిని ఆక్రమించినా, ప్రవేశించిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీఆర్వో హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రయ్యకు నివాళి



రామచంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు: రాపూరు- 2 ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు రేవూరు రామచంద్రయ్య(53) ఉత్తర క్రియలు గురువారం నిర్వహించారు. ఇందులో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, మాజీ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నెల్లూరు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1, 2 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



పట్టణంలోని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వెంకటగిరి(సైదాపురం) : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో సీపీఎం జిల్లా మహా సభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం వెంకటగిరిలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లాలోని సత్యవేడులో డిసెంబర్ 1, 2 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు.

కండలేరులో 52.687 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 52.687 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరద కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సోమశిల నుంచి 4,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 35 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

పెళ్లకూరు: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. దొరవారిసత్రం మండలం, ఏకొల్లు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తమ కుమార్తెను కిడ్నాప్ చేసినట్టు చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన వారు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఈ క్రమంలో గురువారం కిడ్నాప్ కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించి, నిందితుడు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అంగన్‌వాడీలపై ధరల భారం

'మేమొస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తాం. సామాన్యులపై ధరల భారాన్ని తగ్గిస్తాం. ముఖ్యంగా అంగన్‌వాడీలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం' అని కూటమి నేతలు ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతున్నా ధరల గురించి పట్టించుకోలేదు. పైపెచ్చు ధరలు ఆకాశాన్ని అంటాయి. దీనికితోడు అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించే మెస్ చార్జీలను పెంచకపోవడంతో కార్యకర్తలు చేతి నుంచి పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మెనూ చార్జీలు పెంచాలని పలుమార్లు కోరినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం తింటున్న చిన్నారులు



- పాత చార్జీలతోనే మెనూ
- అప్పుల పాలవుతున్న అంగన్‌వాడీలు
- చార్జీలు పెంచాలని వేడుకోలు

దక్కిలి : నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయినా తాము చెప్పిన మెనూ ప్రకారమే చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 256 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటికి వచ్చే చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు ప్రభుత్వమే బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు సరఫరా చేస్తుంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఎంత మేరకు సరుకులు అవసరమో నివేదిక ఇస్తే సరుకులు పంపిణీ చేస్తారు. కందిపప్పు, బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా తెచ్చుకోవాలి. సరుకులు





తరలించుకునేందుకు, కేంద్రంలో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి నగదు చెల్లించదు. గతంలో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి నిర్వహణ చార్జీలు చెల్లించేవారు. ఇప్పుడు ఆ ఊసే లేకపోవడంతో చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు.

కేటాయింపులు ఇలా...

ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుంది. నెలసరి కూరగాయల కోసం రూ.800 చెల్లిస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం రూ.400 ఇస్తోంది. వీటితోనే చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి వుంది. ప్రస్తుతం కూరగాయలు ధరలు భారీగా పెరిగిపోయాయి. ప్రభుత్వం కూరగాయల నిమిత్తం నెలకు కేటాయించే రూ.800 ఏమూలకూ సరిపోవడం లేదు. గ్యాస్‌కు సైతం నగదు సక్రమంగా చెల్లించడంలేదు. పలు సందర్భాల్లో సొంత సొమ్ము పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. మెనూ తప్పక పాటించాలనే చెప్పే ఉన్నతాధికారులు పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు మొత్తాన్ని పెంచాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఉచిత గ్యాస్ అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. ఈ క్రమంలో కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకోసం సబ్బులు, చీపుర్లు, చాపలు తదితర వస్తువులు కొనుగోలు చేయాల్సి వుంటుంది. దీనికి ప్రభుత్వం నుంచి నగదు మంజూరుకాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలే చేతి నుంచి పెట్టుకుంటున్నారు.

మెనూ ఇలా...

సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	పులిహోర,టమాట పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	కూరగాయల పప్పు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు

వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు
దక్కిలి	78
బాలాయపల్లి	72
వెంకటగిరి రూరల్	59
వెంకటగిరి పట్టణం	43

"

ఉన్నతాధికారులకు నివేదించాం



పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు పెంపు విషయాన్ని ఇది వరకే అంగన్‌వాడీ కార్యకర్తలు మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, ఇతర అవసరాలకు అందజేస్తున్న నగదు పెంపు విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

– శంషాద్ బేగం, ఐసీడీఎస్ సీడీపీవో, వెంకటగిరి

నెర్రికాలువపై కుంగిన కల్వర్టు



మినమనముడి-జంగాలపల్లి గ్రామాల మధ్య నెర్రికాలువపై కుంగిపోయిన కల్వర్టు

దొరవారిసత్రం : దొరవారిసత్రం-సూళ్లూరు పేట మండల సరిహద్దు ప్రాంతంలో నెర్రికాలువపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది. రాకపోకలు సాగించే వాహనదారులు ఎప్పుడు ఏమి జరుగుతుందోని ఆందోళన చెందుతున్నారు. మినమనముడి, జంగాలపల్లి మధ్యలో ప్రవహిస్తున్న నెర్రికాలువపై ఎన్నో ఏళ్ల క్రితం కల్వర్టు నిర్మించారు. దీని ద్వారానే మినమనముడి, చందనముడి, శ్రీధనమల్లి, బొందలపాళెం తదితర గ్రామాల ప్రజలు సూళ్లూరుపేట పట్టణానికి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అదేవిధంగా ఫ్యాక్టరీలకు సంబంధించిన భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కల్వర్టు కుంగిపోయింది. ప్రస్తుతం కాలువలోని నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. భారీ వర్షాలు కురిస్తే వరద నీటి ప్రవాహం ఇంకా పెరిగే ఉందని, ఈ క్రమంలో కల్వర్టు కొట్టుకుపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే కొత్త కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

పక్కాగా తల్లిదండ్రుల సమావేశం

దొరవారిసత్రం : వచ్చే నెల 7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో గోవర్ధన, ఎంఈవో మునిశేఖర్ ఆదేశించారు. వారు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షించారు. సమావేశంలో విద్యార్థులు, పాఠశాలల్లోని సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోట : బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ కోట ప్రాజెక్ట్ సీడీపీవో మునికుమారి తెలిపారు. కోటలో గురువారం ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ పరిధిలో బాల్య వివాహాలు జరిగితే అంగన్‌వాడీ సిబ్బందిదే బాధ్యతన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. మారుమూల గ్రామాలు, గిరిజన కాలనీల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్లు కవిత, కిష్టమ్మ, భారతి పాల్గొన్నారు.

సైదాపురం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. సైదాపురంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాల్య వివాహాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్ : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరకుండా చూడాలని ఎంపీడీవో ప్రమీలారాణి, వెలుగు ఏపీఎం ప్రసన్న తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పొదుపు సంఘాల సభ్యులకు బాల్య వివాహాలు, లింగ వివక్షత, బాలికల విద్య, గృహ హింస తదితరాలపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

కండలేరు గురుకుల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని చైత్రకృష్ణ సాధించిన బహుమతులను చూపుతున్న ప్రిన్సిపాల్ భారతి

రాపూరు: రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్‌ఫేర్‌లో కండలేరు గురుకుల పాఠశాల 7వ తరగతి విద్యార్థిని చైత్రకృష్ణ ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. పల్నాడు జిల్లా రామకృష్ణాపురంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌లో గణితం జూనియర్ విభాగంలో పాల్గొన్నట్టు తెలిపారు. చైత్రకృష్ణ గణితంలో బిన్నాలు, కూడికలు, తీసివేతలు, భాగహారాలు తదితరాలను సులభంగా అర్థమయ్యేలా పరికరం తయారు చేసిందని పేర్కొన్నారు. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

కలువాయి దళితవాడలో అగ్నిప్రమాదం

కలువాయి: కలువాయి దళిత వాడకు చెందిన దివ్యాంగురాలు కాటమల్లి పెంచలమ్మ ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. దుస్తులు, ఇతర విలువైన సామగ్రి కాలిపోయాయి. చుట్టు పక్కల వారు గమనించి మంటలను అదుపుచేశారు. ప్రమాదంపై అధికారులకు సమాచారం అందించారు. దివ్యాంగురాలు పెంచలమ్మకు అధికారులు ఆదుకోవాలని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రేవూరి శ్రీనివాసులు కోరారు.

జగన్‌ను కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు రాజకీయ అంశాలపై చర్చించినట్టు నేదురుమల్లి వెల్లడించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు షేక్ రేష్మాయాస్మిన్ వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఎత్తు, బరువు, రక్త ప్రసరణ, చాతీ కొలతలు, దగ్గు, జలుబు పరీక్షలు చేసినట్టు తెలిపారు. వాటి నివేదికలను తల్లిదండ్రులకు ఇవ్వడంతో పాటు పాఠశాలలో భద్రపరుస్తామన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం టీవీ వరప్రసాద్, వైద్య సిబ్బంది విక్టోరియా, శారదమ్మ, ఉమామహేశ్వరి, టీచర్లు శివకుమార్, క్రిష్ణంరాజు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పాతకోట పీహెచ్‌సీ వైద్యులు రాజేష్ వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. హెల్త్ సెక్రటరీ సత్యవేణి, బాలనాగమ్మ, హైమావతి, ల్యాబ్ టెక్నీషియన్ ఫజాయ్, సురేష్ పాల్గొన్నారు.



సైదాపురం: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

దక్కిలి: ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం నాగవోలు, పలుగోడు, లింగసముద్రం, దక్కిలి, వెంబులూరు సచివాలయాల పరిధిలో చేస్తున్న జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సచివాలయాల్లో సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సీనియర్ సహాయకులు సిరాజ్ ఉద్దీన్ ఖాద్రి, జూనియర్ సహాయకులు శరణ్ పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించండి

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ పరిధిలో జియో ట్యాగింగ్ చేస్తున్న సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేయాలన్నారు. హౌస్ హోల్డింగ్‌తోపాటు సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసమే సర్వే చేస్తున్నామన్నారు.



సర్వేపై ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలి

వెంకటగిరి రూరల్ : మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం చెలికంపాడు, కుర్జాగుంట గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు.

తప్పనిసరిగా ఈ-క్రాప్ చేసుకోవాలి

సైదాపురం: రైతులు సాగు చేసే ప్రతి పంటనూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని పొలూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

వెంకటగిరి రూరల్ : సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ తెలిపారు. స్థానిక కేవీకేలో గురువారం రైతులకు సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ వానపాములతో కంపోస్టు తయారీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రైతులకు సేంద్రియ ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాల్, పి.నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది జ్యోతీరావుపూలే

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- జ్యోతీరావు పూలేకు ఘన నివాళి



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కిలివేటి సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్ : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం పరితపించిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. జ్యోతీరావుపూలే వర్ధంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాత బస్టాండు వద్ద ఉన్న జ్యోతీరావు పూలే విగ్రహానికి కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ, పార్టీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా కార్యదర్శి ఒట్టూరు కిషోర్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవ రెడ్డి, నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, పీ హరినాథ్‌రెడ్డి, గంధవళ్లి సిద్దయ్య, చదలవాడ కుమార్, మహిళ రాష్ట్ర కార్యదర్శి రత్నశ్రీ, ముత్యాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది జ్యోతీరావుపూలే

కోట : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమించిన మానవతావాది జ్యోతీరావు పూలే అని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మీజూరు మాధవ్ తెలిపారు. కోటలో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకటరమణయ్య, మల్లికార్జున్, అశోక్, హేమంత్ పాల్గొన్నారు.

ఓజిలిలో...

ఓజిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతీరావుపూలే వర్ధంతిని ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుపరింటెండెంట్ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసమానతల నివారణలో జ్యోతీరావు పూలే విశేష కృషి

గూడూరు రూరల్ : సమాజంలో అసమానతలను తొలగించడంలో జ్యోతీరావు పూలే విశేష కృషి చేశారని కుల వివక్ష పోరాట సమితి నాయకులు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులోని జ్యోతీరావుపూలే విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు దారా కోటేశ్వరరావు, కార్యదర్శి అడపాల ప్రసాద్, కమిటీ సభ్యులు సురేష్, వెంకటరమణయ్య, నరసింహులు, చంద్రయ్య, శ్రీనివాసులు, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే అని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. కానూరులో గురువారం పూలే వర్ధంతిని జరుపుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చినబాబు, నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పెళ్లకూరు మండలం కానూరులో జ్యోతీరావు పూలేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

శిథిలావస్థలో మరుగుదొడ్డి





వేలికాడు పాఠశాల వరండాలో లేచిపోయిన నాపరాళ్లు, దుస్థితిలో పాఠశాల మరుగుదొడ్డి

దొరవారిసత్రం : మండలంలోని వేలికాడు గ్రామం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరింది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం కూడా అధ్వానంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ నాపరాళ్లు లేచిపోయాయి. నీటి వసతి లేకపోవడంతో పిల్లలు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జీఎన్‌టీ రోడ్డును గీకేశారు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని హోలీ క్రాస్ సెంటర్ నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు వున్న జీఎన్‌టీ రోడ్డు దారుణంగా ఉంది. రెండు రోజులుగా చెదురు మదురుగా కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ప్యాచ్ వర్కు చేసేందుకు గుంతలున్న చోట జేసీబీతో గీకి పారేశారు. గీకేసిన చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ జీఎన్‌టీ రోడ్డు ఆర్ అండ్ బీ అధికారుల పరిధిలో వుండడంతో వారు దీనిపై ఏనాడు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల పట్టణంలోకి శ్రీసిటీ సెజ్, మాంబట్టు సెజ్‌లోని పలు కంపెనీలకు చెందిన బస్సులు, స్కూల్స్, కళాశాలల బస్సుల తాకిడి పెరిగింది. వాహనాల రాకపోకలు ఎక్కువకావడంతో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. తాత్కాలికమైన పనులు కాకుండా శాశ్వత పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. గుంతలు పడినచోట గీకేసి ప్యాచ్ వర్కులు కాకుండా హోలీక్రాస్ సెంటర్ నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు సీసీ రోడ్డు గాని, లేదంటే నాణ్యమైన తారు రోడ్డుగాని వేయాలని వాహనచోదకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సూళ్లూరుపేట పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డును గీకేసి వదిలేసిన దృశ్యం